జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com

www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com






- పీఎన్ కాలనీలో ఓమహిళ మెడలో బంగారు ఆభరణాలు తెంచేసి పరారీ
- జిల్లాలో వరుసగా చైన్‌స్నాచింగ్
- భయాందోళనకు గురవుతున్న మహిళలు

# మహిళలే.. టార్గెట్

శ్రీకాకుళం క్రైం, జులై 6 (వార్త): జిల్లాలో ఇటీవల వరుసగా చైన్‌స్నాచింగ్‌లు జరుగుతున్నాయి. మహిళల మెడలోని బంగారు ఆభరణాలు తెంపుకొని అగంతకులు బైక్‌లపై పరారవుతున్నారు. గత నెలలో వజ్రపుకొత్తూరు మండలంలోని పూండి గ్రామంలో రెండు రోజుల వ్యవధిలో మహిళల నుంచి బంగారు ఆభరణాలు తెంపుకొని పోగా, సోమవారం శ్రీకాకుళం నగరంలోని పీఎన్ కాలనీలో ఇటువంటి ఘటన చోటుచేసుకోవడంతో మహిళలు బెంబేలెత్తిపోతున్నారు. ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు భయపడిపోతున్నారు. శ్రీకాకుళం నగరంలోని పీఎన్‌కాలనీలోని ఐదో లైన్‌లోని ఓ అపార్టుమెంట్ నుంచి సోమవారం రాత్రి ఏడున్నర గంటల సమయంలో కణితి నిర్మల వాకింగ్‌కు బయలుదేరివెళ్లింది. అదే సమయంలో హెల్మెట్ ధరించి బైక్‌పై వచ్చిన ఒక అగంతకుడు ఆమె ఒంటరిగా వెళుతున్న సమయం చూసి మెడలో ఉన్న తులం పావు బంగారు గొలుసును బలంగా లాగేసి బైక్‌పై పారిపోయాడు. బలంగా గొలుసును లాగడంతో ఆమె మెడకు తీవ్ర గాయమై కింద పడిపోయింది. ఆ తర్వాత ఆమె లేచి కేకలు వేసింది. స్థానికులు అక్కడికి చేరుకోగా, అప్పటికే అగంతకుడు పారిపోయాడు. సమాచారం అందుకున్న వెంటనే డీఎస్పీ వివేకానంద, వన్‌టౌన్ సీఐ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. నిందితుడిని పట్టుకునేందుకు ఆ వీధిలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. అలాగే వజ్రపుకొత్తూరు మండలంలోని పూండి గ్రామంలో గత నెలలో వరుసగా రెండు రోజుల వ్యవధిలో జరిగిన చైన్ స్నాచింగ్ ఘటనలు చోటుచేసుకున్నాయి. పూండి-పీఎంపురం రోడ్డులో నివాసముంటున్న కోట లక్ష్మి ఇంటి ముందు పూలు కోస్తుండగా వెనుక నుంచి వచ్చిన దుండగుడు ఆమె మెడలోని సుమారు మూడు తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. ఈ క్రమంలో ఆమెను తోసివేయడంతో స్వల్ప గాయాలయ్యాయి. అదే తరహాలో పూండి కర్రెమ్మ వీధిలో దున్న జగదీశ్వరి బాత్‌రూమ్ నుంచి బయటకు వస్తున్న సమయంలో ఆమెను బలంగా నెట్టి, మెడలో ఉన్న సుమారు 55 గ్రాముల (దాదాపు 4.5 తులాలు) బంగారు పుస్తెలతాడును అపహరించి పారిపోయాడు.





# ఆదిత్యుని హుండీ లెక్కింపులో చేతివాటం

- లెక్కింపు మధ్యలో బయటకు వెళుతుండగా పట్టుబడ్డవైనం
- అతడి నుంచి రూ.11,500 స్వాధీనం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఈవో



శ్రీకాకుళం క్రైం, జులై 6 (వార్త): అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని సోమవారం అనివెట్టి మండపంలో ఆలయాధికారుల సమక్షంలో సిబ్బంది, వాలంటీర్లు లెక్కించారు. ఓ వాలంటీరు హుండీ ఆదాయం లెక్కింపు సమయంలో చేతివాటం ప్రదర్శించి అడ్డంగా బుక్కయ్యాడు. హుండీ ఆదాయం లెక్కింపు సమయంలో వాలంటీర్లు, శ్రీవారి సేవకుల సేవలను అరసవల్లి సూర్యనారాయణస్వామి అధికారులు వినియోగించుకుంటున్నారు. సోమవారం లెక్కింపు జరుగుతుండగా విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం బొచ్చపేటకు చెందిన బి.కృష్ణారావు అనే వాలంటీరు ఎవరికీ అనుమానం రాకుండా కాలి వేళ్లకు రబ్బర్ల బ్యాండ్లు చుట్టుకుని.. వాటికి 23.. రూ.500 నోట్లు తగిలించుకున్నాడు. లెక్కింపు మధ్యలో వాష్ రూంకు వెళ్లొస్తానని చెప్పి అనివెట్టి మండపం నుంచి బయటకు వస్తుండగా మూడు నోట్లు కిందపడిపోయాయి. దీన్ని గమనించిన సిబ్బంది అతడిని తనిఖీ చేయగా, రూ.11,500 దొరికింది. ఈవో కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్ ఫిర్యాదు మేరకు పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఒకటో పట్టణ ఎస్సై ఎం.హరికృష్ణ కేసు నమోదు చేశారు.


**మహారాజశ్రీ కోటబొమ్మాళి సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)**

కోర్టులో కేసు నెంబరు IA 48/2026 in OS 13/2026

Between :

**సూరా వెంకటమ్మ** ... పిటీషనర్ / వాది

And

**తమ్మన్నగారి సుజాత మరియు ఇతరులు** ... రెస్పాండెంట్స్ / ప్రతివాదులు

To

(R6, D6) సూరా జగదీశ్వరరావు, s/o లేటు చంద్రశేఖరరావు, సూరా వీధి, శ్రీముఖలింగం గ్రామం & పోస్టు, జలుమూరు మండలం, శ్రీకాకుళం జిల్లా

(R7, D7) బలగ వెంకటలక్ష్మి (భర్త) వెంకటరమణ, సూరా వీధి, శ్రీ ముఖలింగం గ్రామం & పోస్టు, జలుమూరు మండలం, శ్రీకాకుళం జిల్లా

(R8, D8) నాయుడు గారి కిషోర్, s/o నాగేశ్వరరావు, సూరా వీధి, శ్రీ ముఖలింగం గ్రామం & పోస్టు, జలుమూరు మండలం, శ్రీకాకుళం జిల్లా

(R9, D9) సింగూరు రాణి, భర్త క్రిష్ణ, సూరా వీధి, శ్రీ ముఖలింగం గ్రామం & పోస్టు, జలుమూరు మండలం, శ్రీకాకుళం జిల్లా

**NOTICE**

పై కోర్టులో వాది పై నెంబరు IA 48/2026 in OS 13/2026 గల దావా మీ పైన దాఖలా చేసియున్నందున మరియు సదరు దావా తే 22-07-2026 దిన మీ యొక్క హాజరు నిమిత్తం పై కోర్టులో వాయిదా ఉన్నందున సదరు పై తేదీన ఉదయం గం॥ 10-30 ని॥లకు మీరు స్వయంగాగానీ, వకీలు ద్వారా గాని హాజరై మీకు గల అక్షేపణలు తెలియజేయవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించడం అగునని ఈ నోటీసు మూలంగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి తరుపున)

**చింతాడ సురేష్‌కుమార్**, న్యాయవాది, శ్రీకాకుళం. ఫోన్ : 9391378245








## శ్రీకాకుళం

# కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

**- జిల్లా ఐసా, ఆర్‌వైఏ డిమాండ్**

**- ఢిల్లీలో జరుగుతున్న దీక్షలకు సంఘీభావం**

**పలాస, జులై 6(వార్త):** కేంద్ర విద్యాశాఖమంత్రి దర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని జంతర్ మంతర్ వద్ద ఆమరణ నిరాహార దీక్షకు మద్దతుగా పలాస కాశీబుగ్గ పట్టణంలో ఐసా, ఆర్‌వైఏ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా వామపక్ష నేతలు మాట్లాడుతూ ప్రధానంగా దేశంలో నీట్, టెట్ పేపర్లతో సహా అన్ని రకాల కాంపెటేటివ్ పేపర్ల లీక్ అవుతుంటే కంట్రోల్ చేయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మనకు పాలన చేస్తున్నాయని, జవాబు తనం లేని నాయకులు రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు. డిల్లీలో జంతర్ మంతర్ వద్ద గత కొద్దిరోజులుగా జరుగుతున్న ఉద్యమంలో బాగంగ విద్యార్ధిని, విద్యార్థులు రిలే దీక్షలు చేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం కానీ, రాష్ట్ర ప్రభుత్వం కాని స్పందించలేదని మండిపడ్డారు. దేశంలోనీట్ విద్యార్థులు సుమారు 17 విద్యార్ధిని, విద్యార్థులు మరణించారని, వారికోసం కనీసం భాద్యత వహించని కేంద్ర విద్యాశాఖమంత్రి దర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని జంతర్ మంతర్ వద్ద ఆమరణ నిరాహార దీక్షలు చేస్తుఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు . ఈ దేశంలో కనీసమైన రాజ్యాంగం, కాని ప్రజాస్వామ్యంగాని, ఉందా అని విద్యార్ది , యువజన నాయకులు మద్దిల కైలాస్, కుత్తుం. అజాద్, బత్తిని నాగమణి, మద్దిల నారాయణలు ప్రశ్నించారు. ఆమరణ నిరహార దీక్షలు చేపడుతున్న విద్యార్దిని, విద్యార్థులకు ఏమైన జరిగితే భవిష్యత్ ఉద్యమాలు చేపడతామని హెచ్చిరించారు. విద్యాశాఖ మంత్రి దర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర కమిటీ సభ్యులు సన్యాసిరావు, రామారావు, ఎఐసిసిటియు యమ్.వెంకటరమణ, పి.అప్పారావు, వల్లభరావు, పాపారావు, తదితరులు జిల్లా నాయకులు కె.లోకనాథం, పి.నాగేశ్వరరావు, కె.దుష్యంత్, పాల్గొన్నారు.




## మందస తహసీల్దార్‌గా శ్రీహరిబాబు

**మందస, జులై 6(వార్త):** మందస మండల నూతన తహసీల్ధార్ గా బలివాడ శ్రీహరిబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు తహసీల్ధార్ గా పని చేసిన మిస్క శ్రీకాంత్ సెలవుపై ఉన్నారు. దీంతో శ్రీహరిబాబును మందస తహసీల్ధార్ గా జిల్లా ఉన్నతాధికారులు నియమించారు. శ్రీహరిబాబు ఇచ్ఛాపురం తహసీల్ధార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్ధార్ గా పని చేస్తుండగా.. ఆయనకు తహసీల్ధార్ గా పదోన్నతి లభించింది. పలాస ఆర్.డి.ఒ. కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ అధికారిగా నియమితులయ్యారు. మందస తహసీల్ధార్ మిస్క శ్రీకాంత్ సెలవుపై ఉండడంతో శ్రీహరిబాబుకు పూర్తి అదనపు బాధ్యతలతో మందస తహసీల్ధార్ గా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబద్ధతతో పని చేస్తానన్నారు. బాధ్యతతో పని చేసి, మంచి పేరు తీసుకువస్తానన్నారు. కాగా.. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీహరిబాబుకు మందస తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది స్వాగతం పలికి, అభినందించారు.



## మహేంద్రతనయ కాలువల పనులను పరిశీలించిన అధికారులు



**మందస, జులై 6(వార్త):** సోంపేట, మందస మండలాలలకు సంబంధించిన మహేంద్రతనయ సాగునీటి వనరుల కాలువల పనులను అధికారులు పరిశీలించారు. సోంపేట మండలంలోని కర్తలపాలెం నీటి సంఘం పరిధిలోని సుమారు ఆరు గ్రామాల రైతుల సాగునీటి కష్టాలను తీర్చేందుకు ఒక గొప్ప అడుగు పడింది. మహేంద్రతనయనది పరిధిలో గల సోంపేట మండలంలోని పొత్రఖండ నుండి మందస మండలంలోని గోపాలపురం, శ్రీనివాసపురం, మూలిపాడు తదితర గ్రామాల రైతులకు సంబంధించిన సుమారు 300ఎకరాల పొలాలకు సాగునీరు అందించేలా, సుమారు 3కిలోమీటర్ల పొడవునా కాలువలకు మరమ్మతులు చేపట్టారు. రూ.3లక్షలతో అంచనా వ్యయంతో కాల్వల తవ్వకం, మరమ్మత్తు పనులు జరిగాయి. ప్రతీ చేనుకి నీరు-ప్రతీ చేతికి పని" అనే సంకల్పానికి నిదర్శనంగా. స్థానిక రైతులు పాల్గొని, కాలువల పనుల పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ పనులు పూర్తి కావడంతో 6 గ్రామాల రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలగిపోనున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా శ్రమిస్తున్న అధికారులకు, నీటి సంఘం నాయకులకు గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జలవనరులశాఖ అసిస్టెంట్ ఇంజనీర్ సూర్యప్రకాష్, ఇరిగేషన్ అధికారి పాఢి, కర్తలపాలేం నీటిసంఘం అధ్యక్షుడు గోకర్ల కృష్ణారావు, వైస్ ప్రెసిడెంట్ బురద దేవరాజు, టీసీ బైరి హేమరాజు, మూలిపాడు మాజీ సర్పంచ్ కొండపల్లి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## మందసలో యథావిధిగా రిజిస్ట్రేషన్లు

**- సబ్ రిజిస్ట్రార్ రఘురాంపండా**

**మందస, జులై 6(వార్త):** సమస్య సాధనకు డాక్యుమెంట్ రైటర్లు పెన్ డౌన్ కార్యక్రమం చేపట్టారు. దీంత నిత్యం రద్దీగా ఉంటే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం బోసిపోయింది. ప్రజలు రిజిస్ట్రేషన్ జరుగుతాయా.. లేదా.. అన్న సందేహంలో ఉన్నారు. డాక్యుమెంట్ రైటర్లు పనులు చేయకపోవడంతో భూరిజిస్ట్రేషన్లు నిలిచిపోతాయన్న అనుమానంలో ప్రజలు ఉండడంతో ఈవిషయమై జాతీయవార్త సబ్ రిజిస్ట్రార్ రఘురాంపండాను వివరణ కోరగా.. ఆయన ప్రజల సందేహాన్ని నివృత్తి చేశారు. మందస సబ్ రిజిస్ట్రార్ కార్యాయలంలో రిజిస్ట్రేషన్లు యథావిధిగా కొనసాగుతాయని చెప్పారు. డాక్యుమెంట్లను ప్రజలు ప్రభుత్వ వెబ్ సైట్ లోని పబ్లిక్ డేటా ఎంట్రీలో తయారు చేసిన డాక్యుమెంట్లను పీడీఎఫ్ డౌన్ లోడ్ చేయించుకుని వస్తే తప్పక రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. ఈ ప్రక్రియ సులువుగానే ఉంటుందన్నారు. డాక్యుమెంట్ రైటర్లు పెన్ డౌన్ చేస్తున్న తరుణంలో ప్రజలు ఈ విషయాన్ని గమనించాలన్నారు. యథావిధిగానే జరిగే రిజిస్ట్రేషన్ కార్యాలయం సేవలను సద్వినియోగం చేసుకోవాలని రఘురాంపండా కోరారు.



# లోహారిబందలో కిడ్నీవ్యాధితో మహిళ మృతి

**మందస, జులై 6(వార్త):** ఉద్దాన ప్రాంతంలో కిడ్నీ వ్యాధి మరణాలు కొనసాగుతున్నాయి. మందస మండలంలోని లొహరిబంద గ్రామానికి చెందిన మహిళ పందిరి లక్ష్మి కిడ్నీవ్యాధితో మరణించింది. గత రెండు సంవత్సరాలు లక్ష్మి కిడ్నీవ్యాధితో బాధ పడుతోంది. పరిస్థితి డయాలసిస్ వరకు చేరుకుంది. కానీ, ఆమె డయాలసిస్ సౌకర్యం అందించేవారు లేకపోవడంతో చికిత్స కరువయ్యింది. దాతలు రక్తదానం చేయడంతో కొంతకాలంగా జీవితాన్ని నెట్టుకవస్తున్నారు. గత రెండు రోజులుగా ఆమె పరిస్థితి విషమించగా.. సోమవారం మరణించింది. కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా.. ఉద్దానంలో కిడ్నీవ్యాధి మరణాలకు అంతంలేదా.. అని ఉద్దానం ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# ఘనంగా అల్లూరి జయంతి



**కంచిలి, జులై 6(వార్త):** అల్లూరి సీతారామరాజు 129వ జయంతి బూరగాం గ్రామంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అనివార్య కారణాలవల్ల కొద్ది ఆలస్యంగా కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక నేత బొట్టా శ్రీరాములు, ప్రజా కళామండలి బృందం ఆధ్వర్యంలో ఘనంగా జయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో పలువురు వక్తలు అల్లూరి సీతారామరాజు గిరిజనుల హక్కులు, భూమి--అడవుల పరిరక్షణ కోసం బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా సాగించిన వీరోచిత పోరాటాన్ని స్మరించుకున్నారు. ఆయన త్యాగస్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుసుమ మాట్లాడుతూ, మహిళల సమాన హక్కులు, రైతు--కూలీ--గిరిజనుల సమస్యల పరిష్కారం, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అల్లూరి ఆశయాలను ఆచరణలో పెట్టడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. సామాజిక కార్యకర్త అరుణ మాట్లాడుతూ, శ్రీకాకుళం ఉద్యమాల నేల అని, ఈ నేలకు పోరాటాల చరిత్ర కొత్తది కాదన్నారు. ప్రస్తుతం కార్పొరేట్ అనుకూల విధానాల కారణంగా తూర్పు కనుమల కొండలు, అడవులు, సహజ వనరులు కనుమరుగయ్యే ప్రమాదంలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని పరిరక్షించే బాధ్యత ప్రజలందరిపై ఉందని, కార్పొరేట్--ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర ప్రజా గొంతుక ప్రతినిధి రామకృష్ణ మాట్లాడుతూ, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయాలు నేటి ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని అన్నారు. ప్రజల హక్కులు, భూమి, అడవులు, సహజ వనరుల పరిరక్షణ కోసం ప్రజలందరూ సంఘటితమై పోరాడాలని, కార్పొరేట్ దోపిడీ విధానాలను ప్రజా ఉద్యమాల ద్వారానే ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీరాములు, ప్రజా కళామండలి బృందం విప్లవ, చైతన్య గీతాలను ఆలపించి అమరుల స్ఫూర్తిని ప్రజల్లో నింపింది. ఆ గీతాలు సభకు హాజరైన వారిలో ఉద్యమ చైతన్యాన్ని పెంపొందించాయి. ఈ కార్యక్రమంలో శ్రీరాములు ప్రజా కళామండలి బృందం ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు, మహిళలు, యువత, రైతులు, కూలీలు, ప్రజాసంఘాల నాయకులు, రాజు, వెంకటరావు,కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మత్స్యకార బిడ్డకు న్యాయానికి నిరీక్షణా?

**- వంద రోజులు అన్నారు.. రెండేళ్లు దాటినా ఇచ్చిన హామీ ఏమైంది?**

**- మత్స్యకార కుటుంబంమైనంతమాత్రాన న్యాయం ఆలస్యం అవుతుందా?**

**- సీబీఐకి ఇవ్వడానికి భయమా?**

**-దోషులను కాపాడే ఆలోచనా?**

**పలాస, జులై 6(వార్త):** శివానీ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థి, మత్స్యకార బిడ్డ ముర్వల నగేష్ దుర్మరణం జరిగి 5 సంవత్సరాల 6 నెలలు గడిచినా ఆ కుటుంబానికి ఇప్పటికీ న్యాయం జరగకపోవడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అని వైయస్సార్సీపి సీనియర్ నేత, ప్రముఖ న్యాయవాది దువ్వాడ శ్రీధర్ బాబా అన్నారు. సోమవారం పలాసలో ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి రావడానికి ముందు ప్రజల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. 2024లో పలాసలో జరిగిన యువగళం సభ వేదికగా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ముర్వల నగేష్ కుటుంబానికి న్యాయం చేస్తామని నారా లోకేష్ బహిరంగంగా ప్రకటించారని గుర్తు చేశారు. అంతకుముందు 2023లో రణస్థలంలో జరిగిన పబ్లిక్ మీటింగ్‌లో పవన్ కళ్యాణ్ కూడా "మా ప్రభుత్వం తీసుకుని రండి, మత్స్యకార బిడ్డ ముర్వల నగేష్ కుటుంబానికి న్యాయం చేస్తాను" అని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి 754 రోజులు గడిచినా నేటికీ ఆ హామీ కాగితాలకే పరిమితమైందని ఆరోపించారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టికి నేరుగా మృతుడైన ముర్వల నగేష్ తల్లితోపాటు కుటుంబ సభ్యులందరూ తమకు న్యాయం చేయాలంటూ వేడుకున్నప్పటికీ, ఇప్పటివరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి గాని, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ దృష్టికి గాని తీసుకెళ్లకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రజా ప్రతినిధిగా బాధ్యతను విస్మరించడం సరికాదని అన్నారు. మత్స్యకార వర్గానికి చెందిన కుటుంబం కాబట్టే న్యాయం కోసం ఇన్ని సంవత్సరాలు వేచి చూడాల్సి వస్తుందా అని ప్రశ్నించారు. బలహీన వర్గాల పట్ల ప్రభుత్వానికి చిన్నచూపు ఉందనేందుకు ఇదే నిదర్శనమని అన్నారు. నగేష్ మరణం వెనుక ఉన్న వాస్తవాలు ఇప్పటికీ బయటకు రాలేదని, కేసు దర్యాప్తును నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని అనుమానం వ్యక్తం చేశారు. అందుకే నిజాలను నిగ్గు తేల్చాలంటే వెంటనే ఈ కేసును సీబీఐ విచారణకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ప్రజల మధ్య, బహిరంగ సభల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడం ప్రభుత్వ ధర్మమని స్పష్టం చేశారు. ముర్వల నగేష్ కుటుంబానికి తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని, బాధ్యులెవ్వరైనా చట్టం ముందు నిలబెట్టి నిష్పాక్షిక విచారణ అనంతరం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కేసును మరుగున పడేయాలని చూస్తే ప్రజాస్వామ్యంపై ప్రజలకు ఉన్న నమ్మకం పూర్తిగా దెబ్బతింటుందని హెచ్చరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి హామీని అమలు చేయాలని, లేనిపక్షంలో ప్రజల కోసం, న్యాయం కోసం రోడ్డుపైకి వచ్చి పోరాడతామని స్పష్టం చేశారు. న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని, ముర్వల నగేష్ కుటుంబానికి అండగా ఉంటూ ప్రతి వేదికపై గొంతు వినిపిస్తామని దువ్వాడ శ్రీధర్ బాబా పేర్కొన్నారు.



## ఎన్‌జీవోల సహకారంతో బాహుదా గ్రోయిన్ల మరమ్మతులు

**ఇచ్ఛాపురం, జులై 6(వార్త):** ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ ఇచ్ఛాపురం నియోజకవర్గంలో బాహుదా నదిపై గల గ్రోయిన్లు శిధిలావస్థకు చేరుకోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైఎస్సార్సీపి ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇంచార్జి సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి అన్నారు.

మంగళవారం ఇచ్ఛాపురం మండలంలోని బాహుదా నదిపై గల బొడ్డబొడ, అరకభద్ర (శాసనం, టి.భరంపురం), తోటూరు (బిర్లంగి, తేలుకుంచి), రత్తకన్న, బెల్లుపడ గ్రోయిన్ లు అనుబంధ కాలువలను వాటర్ అండ్ లైవ్లీహుడ్ అనే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. పరిశీలనలో దాదాపు అన్ని గ్రోయిన్లు నిరుపయోగంగా ఉన్నట్లు, కాలువల్లో పూడిక పేరుకుపోయిందని గుర్తించారు. దీంతో ఖరీఫ్‌లో వేలాది ఎకరాలకు సాగునీరు అందే పరిస్థితి లేదని ఆయన తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి ఎన్ జి వో సంస్థ ద్వారా ఇంజనీరింగ్ ఎస్టిమేషన్లు వేయించేందుకు సిద్ధమవుతున్నామని శ్యాం ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. దీని ప్రకారం కొన్ని చానెల్స్ రిపేర్స్, కొన్ని గ్రామాలలో డీజిల్ ఆపరేటెడ్ పంపులు, సోలార్ ఆపరేటెడ్ పంపులు, అర్ ఓ ప్లాంట్స్, వాటర్ స్టోరేజ్ ట్యాంకుల మరమ్మతులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని వెల్లడించారు.

ప్రతిపక్షంలో ఉన్నామని, ప్రభుత్వం తనంతట తాను నిధులు ఇవ్వదని, పోరాటం చేస్తేనే నిధులు వస్తాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



## డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు



**పలాస, జులై 6(వార్త):** డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు సోమవారం అర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యక్షులు పాలవలస వైకుంఠ రావు, పలాస నియోజక వర్గం పూర్వ కన్వీనర్ రామానంద స్వామి జీలు మాట్లాడుతూ దేశ సమగ్రత, ఒకే పరిపాలన విధానం, జాతీయ ఏకత్వం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహానీయుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీఅని, ఆయన ఆశయాలు నేటి తరాలకు స్ఫూర్తిదాయకం" అని అన్నారు. డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ కాశ్మీర్ సమగ్రత కోసం చేసిన పోరాటం, ఆయన త్యాగం చిరస్మరణీయమని, ఆయన చూపిన బాటలో నడుస్తూ దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, ప్రముఖ జాతీయవాద నాయకులు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతిని ప్రతీ ఏటా జులై 6 వ తేదీన జరుపుకుంటామని గుర్తు చేశారు. 2001 జూలై 6 న కలకత్తా లో జన్మించిన ఆయన "ఒకే దేశం ఒకే రాజ్యాంగం" అనే నినాదం తో దేశ సమైక్యత కోసం అవిశ్రాంతంగా పోరాటం చేశారని, 33 ఏళ్ల వయస్సులో కలకత్తా విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్ అయ్యారని తెలిపారు. అతని పదవీ కాలంలో అనేక నిర్మాణాత్మక సంస్కరణలను ప్రవేశపెట్టారని అన్నారు. స్వతంత్ర భారత తొలి పరిశ్రమల శాఖ మంత్రిగా దేశ పారిశ్రామిక విధానానికి పునాదివేసిన అద్భుత మేధావని తెలిపారు. తొలి హిందూ వాద రాజకీయ పార్టీని స్థాపించిన నేతగా స్థానం సంపాదించి జనసంఘ్ పార్టీ నీ స్థాపించారని పేర్కొన్నారు. జాతీయ ఏకత్వం కోసం తన ప్రాణాలను అర్పించిన మహానేతని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ అధ్యక్షులు పొట్నూరు తారకేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి బొండా శ్రీనివాస రావు, ఎస్ సి మోర్చా జిల్లా కార్యదర్శి గుంటు అప్పారావు, టౌన్ ఉపాధ్యక్షులు తిరునగరి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాశీబుగ్గ పెట్రోల్ బంక్ జంక్షన్లో బస్సు షెల్టర్ నిర్మించాలి



**పలాస, జులై 6(వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలటీ పరిధిలోని కాశీబుగ్గ పెట్రోల్ బంక్ జంక్షన్ వద్ద అత్యవసరంగా బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని టీడీపీ వార్డు ఇన్చార్జి చెల్లూరి రామకృష్ణ స్థానిక యువకులతో కలిసి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ప్రజల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడా కాశీబుగ్గ పెట్రోల్ బంక్ జంక్షన్ ఉదానం ప్రాంతానికి వెళ్లే ప్రధాన రహదారిగా ఉండటంతో ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు, రైతులు, సాధారణ ప్రయాణీకులు ఇక్కడి నుంచి బస్సుల కోసం వేచి ఉంటారని తెలిపారు. జంక్షన్ వద్ద కనీసం బస్సు షెల్లర్ లేకపోవడంతో మండే ఎండలో, కుండపోత వర్షాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేకించి పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు గంటల తరబడి రోడ్డుపక్కనే నిలబడి బస్సుల కోసం ఎదురుచూడాల్సి వస్తోందన్నారు. వర్షకాలంలో తడుస్తూ, వేసవిలో ఎండ తీవ్రతను తట్టుకుంటూ ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులకు ఈ సమస్య మరింత ఇబ్బందికరంగా మారిందన్నారు. ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని కాశీబుగ్గ పెట్రోల్ బంక్ జంక్షన్ వద్ద శాశ్వత బస్సు షెల్టర్ నిర్మాణానికి మున్సిపాలటీ తక్షణ చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో కోరారు. ఈ ప్రాంతంలో బస్సు షెల్టర్ ఏర్పాటు చేయడం ద్వారా వేలాది మంది ప్రయాణికులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో మున్సిపల్ యంత్రాంగం చొరవ చూపాలని, ప్రజా అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని రామకృష్ణ కోరారు. స్థానికుల అభ్యర్ధనను సానుకూలంగా పరిశీలించి వీలైనంత త్వరగా బస్సు షెల్టర్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ శ్రీనివాసులు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువకులు, టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

## పది టన్నుల యూరియా పంపిణీ

**మెళియాపుట్టి, జులై 6(వార్త):** మెళియాపుట్టి మండలంలో ఏపీ ఏఐఎంఎస్ ద్వారా 10 టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి ఎస్. దానకర్ణుడు తెలిపారు. సోమవారం నాడు కోసమల పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు అధ్యక్షతన రైతులకు యూరియా పంపిణీ చేశారన్నారు. రైతులు వారు సాగు చేస్తున్న భూమి వివరాల ప్రకారం ఏ పి ఏ ఐ ఎం ఎస్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వటం జరిగిందన్నారు. రైతులకు యూరియా ఎరువు 3 విడతలలో పంపిణీ చేయటం జరుగుతుందని ఈ విషయం రైతులు గమనించాలన్నారు. ఇప్పటి వరకు 33 టన్నుల యూరియా, 18 టన్నుల డిఏపి, రైతులకి అందించినట్లు తెలిపారు. రైతులు డి ఎ పి కి ప్రత్యామ్నాయంగా ట్రిపుల్ సూపర్ ఫాస్ఫేట్, కాంప్లెక్స్ ఎరువులు వాడాలని, మండలంలో 18 రైతుసేవా కేంద్రాలలో180 టన్నులు యూరియా, 60 టన్నుల డి ఏ పి 60 టన్నులున్నట్లు తెలిపారు. కోసమల పిఎసిఎస్ లో 25 టన్నులు యూరియా, ప్రైవేట్ దుకాణాలలో 10 టన్నులు యూరియా, డి ఏ పి 5 టన్నులు నిల్వలు ఉన్నట్లు తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమంలో వ్యవసాయధికారి దానకర్ణుడి తోపాటు పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహన్ రావు, నాయకులు ప్రజాప్రతినిధులు సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# సుందరీకరణకు చారిత్రక సంపద విధ్వంసమా?

**-కూల్చివేసిన మండపాన్ని, శిలాస్తరణాన్ని పునర్నిర్మించాలి**

**- తహసీల్దార్, ఎంపీడీఓలకు మందస ప్రజల వినతి**



**మందస, జులై 6(వార్త):** మందస పట్టణంలోని చారిత్రక గోపాలసాగరం సుందరీకరణ పనుల పేరుతో ప్రాచీన కట్టడాలను నిలువునా ధ్వంసం చేస్తుండటంపై స్థానిక ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గతంలోనే ఇక్కడి పురాతన కట్టడాలకు నష్టం వాటిల్లుతున్న విషయమై 'పీజీఆర్ఎస్'(గ్రీవెన్స్)లో అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ, ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. అధికారుల నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకుని, ఆదివారం కూల్చి వేసిన మండప ప్రాకారంలో, ఎంతో విశిష్టమైన రాళ్లతో పరిచిన "శిలాస్తరణాన్ని"(రాతి ఫ్లోరింగ్) పూర్తిగా ధ్వంసం చేశారు. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ నిర్మాణాన్ని కూల్చివేయడాన్ని గమనించిన స్థానిక ప్రజలు, ప్రాచీన కట్టడాల పరిరక్షణ కమిటీ కన్వీనర్ మామిడి కోదండరావు, చరిత్ర ప్రేమికుడు, మందస ఎంపీటీసీ కంచి బెహరా తదితరులు కలిసి నిర్మాణ పనులను అక్కడికక్కడే అడ్డుకున్నారు. ఈ చారిత్రక విధ్వంసానికి నిరసనగా మందస మండల తహసీల్దార్, డిప్యూటీ ఎంపీడీఓ, ఎన్.ఆర్.జి.ఎస్. ఏపీఓలకు పలు ప్రజాసంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు కలిసి కూల్చివేసిన మండపాన్ని పునర్నిర్మించాలని సోమవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మందస అభివృద్ధి కమిటీ నాయకుడు ప్రభాకర్ పట్నాయక్ మాట్లాడుతూ గోపాలసాగరం వద్ద ప్రాచీన కట్టడాలను, ప్రాకారాలను తక్షణమే పరిరక్షించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్లపై, అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే దీనిపై ఎమ్మార్వో, ఏపీఓలు స్పందిస్తూ, సుందరీకరణ పనులలో మండపం తొలగింపు అంశమే లేదని పేర్కొనడం గమనార్హమన్నారు. ఈ అంశంపై మోటారు వెహికల్ సంఘం నాయకుడు రట్టి లింగరాజు మాట్లాడుతూ అనుమతులు లేకుండా ప్రాచీన కట్టడాలను ధ్వంసం చేయడం చట్టవిరుద్ధమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధ్వంసం వెనకున్న శక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సామాజిక కార్యకర్త శ్రీనివాస్ పాడి మాట్లాడుతూ ఆ మండపంపై అత్యంత ప్రాచీనమైన బ్రాహ్మి లిపిలో ఉన్న శిలాశాసనాలు ఉన్నాయని గుర్తుచేశారు. ఇలాంటి అద్భుతమైన చారిత్రక సంపదను ఎటువంటి అనుమతులు లేకుండా ధ్వంసం చేయడం అత్యంత దురదృష్టకరమన్నారు. ప్రాచీన కట్టడాల పరిరక్షణ కమిటీ కన్వీనర్ పురుషోత్తం బెహరా మాట్లాడుతూ పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామనే నెపంతో ప్రాచీన కట్టడాలను కూల్చివేయడం అన్యాయమని, కాంట్రాక్టర్ చేసిన ఈ కూల్చివేతలకు ప్రభుత్వాధికారులే పూర్తి బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. పట్టణ పేదల సంఘం నాయకుడు నిరంజన్ బెహరా మాట్లాడుతూ తవ్వకాలు ప్రారంభించినప్పటి నుండి ఇవి ప్రాచీన కాలానికి చెందిన కట్టడాలని కాంట్రాక్టరుకు గుర్తుచేస్తున్నప్పటికీ, పెడచెవిని పెట్టడం వల్లే ఈరోజు తీవ్రమైన చారిత్రక నష్టం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యర్రనాగుల శ్రీను, పూర్ణచందు, మట్ట బెనర్జీ, పూర్ణచంద్ర, కురేష్, శంకర్, వీరాస్వామి, బాలు, పురుషోత్తం, నిరంజన్, శ్రీనివాస్ పాడి, గయా సంతోష్, దువ్వు జగదీష్ పాల్గొన్నారు.

## నిరుపయోగంగా నీటి కుంటలు

**-ఇన్‌లెట్, అవుట్‌లెట్ సౌకర్యాల లేమితో నిధుల వృథా**

**- అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం**



**నరసన్నపేట, జులై 6(వార్త):** వేసవి కాలంలో పశుపక్షాదుల దాహార్తిని తీర్చేందుకు లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన నీటి కుంటలు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణంలో లోపాలు, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ కుంటలు తమ ఉద్దేశాన్ని నెరవేర్చలేక దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయని విమర్శిస్తున్నారు. పశువులు, పక్షులకు తాగునీరు అందించాలనే లక్ష్యంతో నిర్మించిన ఈ నీటి కుంటలకు ఇన్‌లెట్, అవుట్‌లెట్ సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడంతో నీరు చేరే మార్గమే లేకుండా పోయిందని స్థానికులు చెబుతున్నారు. దీంతో కుంటలు ఖాళీగా ఉండిపోతుండగా, నిర్మాణానికి వెచ్చించిన ప్రభుత్వ నిధులు వృథా అయ్యాయని ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా సరైన అవుట్‌లెట్ లేకపోవడంతో కుంటలను శుభ్రపరిచే అవకాశం కూడా లేకుండా పోయిందని, నిర్వహణ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని అంటున్నారు. నిర్మాణ సమయంలో సాంకేతిక ప్రమాణాలు పాటించకపోవడం, అనంతరం అధికారులు పర్యవేక్షణ చేయకపోవడమే ఈ పరిస్థితికి కారణమని అభిప్రాయపడుతున్నారు. వేసవి కాలంలో పశుపక్షాదులకు నీటి అవసరం అత్యధికంగా ఉండే సమయంలో ఈ కుంటలు ఉపయోగపడకపోవడం బాధాకరమని స్థానికులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నిర్మాణ లోపాలను సరిదిద్దడంతో పాటు నీటి కుంటలను వినియోగంలోకి తీసుకురావాలని, భవిష్యత్తులో ప్రజాధనం వృథా కాకుండా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

## రాష్ట్రస్థాయిలో జూనియర్ కళాశాల విద్యార్థిని ప్రతిభ



**సోంపేట, జులై 6(వార్త):** సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని సోనాలి సాహూ రాష్ట్ర స్థాయిలో ఇటీవల జరిగిన ఈఈటీ పరీక్షలో మొదటి ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎ.మోహన్‌రావు తెలిపారు. కళాశాలలో ఒకేషనల్ గ్రూపులో కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ చదివిన సాహూ రాష్ట్ర స్థాయిలో జరిగిన లాటరల్ ఎంట్రీ డిప్లమా ఇన్ ఎలక్ట్రానిక్స్, ఇంజనీరింగ్, టెక్నీషియన్ పరీక్షలో మొదటి ర్యాంకు రావడం పట్ల విద్యార్థిని తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం విద్యార్థినిని అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నతమైన స్థానాల్లో నిలిచి ఉత్తమ కెరీర్ సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది రజనీకుమారి తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత

**- వ్యవసాయ మార్కెట్ కమిటీ సమస్యల పరిష్కారానికి చర్యలు**

**- ఏఎంసీ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**




**నరసన్నపేట, జులై 6(వార్త):** రైతుల సంక్షేమం, వ్యవసాయ మార్కెట్ యార్డుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం నరసన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) కార్యాలయంలో మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు పాగోటి ఉమామహేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న సమస్యలను సమగ్రంగా పరిశీలించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. రైతులు మార్కెట్ యార్డుకు పంటలను తీసుకువచ్చే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు పాలకమండలి సభ్యులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మార్కెట్ యార్డులో పారదర్శకత, సౌకర్యాల కల్పన, రైతులకు అనుకూలమైన వాతావరణం కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ రంగం బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతుల అవసరాలకు అనుగుణంగా మార్కెట్ కమిటీ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన, పోలాకి పీఏసీఎస్ చైర్మన్ భైరి భాస్కరరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గొర్లె యర్రయ్య, డైరెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, మార్కెట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణను పారదర్శకంగా నిర్వహించాలి

**- ప్రత్యేక సవరణ ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**- క్షేత్రస్థాయిలో నిబంధనల ప్రకారం ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం**



**పోలాకి, జులై 6(వార్త):** ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఆదివారం పోలాకి మండలం ఉరజాం గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటర్ల నమోదు, పేరు మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన దరఖాస్తులను స్వయంగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న పరిశీలన పారదర్శకంగా ఉండాలని, ప్రతి దరఖాస్తును నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ప్రతి ఓటరికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఓటర్ల జాబితా సవరణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ప్రజలకు అవసరమైన సహకారం అందించి ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అలాగే ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

## మూలనపడిన ఏపీ ఫైబర్ నెట్ సేవలు

**-నెట్ లేక ఇబ్బందులు పడుతున్న సచివాలయ సిబ్బంది**

**- సొంత మొబైల్ డేటాతోనే ప్రభుత్వ సేవలు**




**నరసన్నపేట, జులై 6(వార్త):** ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వ హయాంలో గ్రామ, వార్డు సచివాలయాలకు లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన ఏపీ ఫైబర్ నెట్ సేవలు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. ప్రారంభించిన కొద్ది కాలానికే సాంకేతిక లోపాలు, సరైన నిర్వహణ లేకపోవడంతో అనేక ప్రాంతాల్లో ఫైబర్ నెట్ వ్యవస్థ మూలనపడిందని సిబ్బంది, స్థానికులు చెబుతున్నారు. సచివాలయాల్లో ఇంటర్నెట్ సౌకర్యం సరిగా లేకపోవడంతో ప్రభుత్వ సేవల నిర్వహణలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. పౌరులకు అందించాల్సిన వివిధ ఆన్‌లైన్ సేవలు ఆలస్యమవుతుండగా, సిబ్బంది తమ వ్యక్తిగత మొబైల్ ఫోన్ల డేటాను ఉపయోగించి ప్రభుత్వ పోర్టళ్లలో పనులు పూర్తి చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ప్రభుత్వ సేవల నిర్వహణకు అదనపు సమయం పడటమే కాకుండా, సిబ్బందిపై ఆర్థిక భారం కూడా పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు త్వరితగతిన సేవలు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఫైబర్ నెట్ వ్యవస్థ నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా ఆశించిన ఫలితాలు కనిపించడం లేదని అభిప్రాయపడుతున్నారు. అధికారులు స్పందించి ఏపీ ఫైబర్ నెట్ సేవలను పునరుద్ధరించి, సచివాలయాల్లో స్థిరమైన ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించాలని సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు. డిజిటల్ సేవల అమలుకు ఇంటర్నెట్ కీలకమైన నేపథ్యంలో సమస్యను తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన ఎంఈఓ




**జలుమూరు, జులై 6(వార్త):** కరకవలస ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) బమ్మిడి మాధవ సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు వండిన కూరలు, అన్నం, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను ఆయన స్వయంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం పరిశుభ్రంగా, నాణ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, విద్యాభివృద్ధి, మధ్యాహ్న భోజన పథకం అమలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రతి విద్యార్థికి రుచికరమైన, పోషక విలువలు కలిగిన భోజనం అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా నాణ్యతతో పాటు విద్యార్థుల ఆరోగ్యానికి కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా అమలు చేయాలని ఎంఈఓ బమ్మిడి మాధవ ఆదేశించారు.

## నీటి సరఫరా నిలిచి రోగులకు ఇబ్బందులు

**- నరసన్నపేట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం**

**- అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రోగుల విజ్ఞప్తి**

**నరసన్నపేట, జులై 6(వార్త):** నరసన్నపేట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నీటి సరఫరా నిలిచిపోవడంతో రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కనీస అవసరాలకు కూడా నీరు అందుబాటులో లేకపోవడంతో ఆసుపత్రి ప్రాంగణంలో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. ఆసుపత్రిలో నీటి మోటార్‌ను సమయానికి ఆన్ చేయాల్సిన బాధ్యత ఉన్న సిబ్బంది విధులకు హాజరుకాకపోవడంతో నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయిందని సమాచారం. దీంతో తాగునీరు, మరుగుదొడ్ల వినియోగం, ఇతర అవసరాల కోసం రోగులు తీవ్ర అవస్థలు పడ్డారు. నీరు అందుబాటులో లేకపోవడంతో పలువురు రోగులు, వారి బంధువులు ఆసుపత్రి సమీపంలోని చేతి పంపులపై ఆధారపడాల్సి వచ్చింది. చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చిన ప్రజలు కనీస మౌలిక సదుపాయాలు కూడా అందుబాటులో లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని రోగులు, వారి బంధువులు అధికారులను కోరుతున్నారు. ఆసుపత్రిలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.




## దస్తావేజు లేఖరుల నిరసన

**సోంపేట, జులై 6(వార్త):** సోంపేటలో సోమవారం దస్తావేజులేఖరులు, సిబ్బంది కలసి రెండు రోజుల నిరసన కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు పెన్ డౌన్ చేపట్టారు. ప్రభుత్వ రిజిస్ట్రేషన్,స్టాంపుల కార్యాలయాల్లో ఫ్రంట్ ఆఫీస్ ఏర్పాటు, ప్రైవేటు భాగస్వామ్యాన్ని కల్పించడం వంటి చర్యలను దస్తావేజులేఖరులు తీవ్రంగా ఖండించారు. ఎన్నో ఏళ్లుగా రిజిస్ట్రేషన్లు ఇతర వ్యవహారాల్లో రిజిస్ట్రేషన్ దారులకు అవసరమైన సేవలందిస్తూ జీవనోపాధి గడుపుతున్న దస్తావేజులేఖరులు,సిబ్బంది పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని పూర్తిగా తప్పుపట్టారు. రిజిస్ట్రేషన్ల శాఖలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని కల్పించడం సహించరాని నేరమని దీని వల్ల అవకతవకలు అధికమై వ్యవస్థ మరింత దిగజారుతుందని పేర్కొన్నారు. అక్రమాలకు తావు లేకుండా ఇప్పటివరకు సేవలందిస్తున్న తమ పట్ల ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంఘం పిలుపుమేరకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోను వ్యతిరేకిస్తూ రెండు రోజులు పాటు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం తహసిల్దార్ కార్యాలయం ఎదురుగా ధర్నా చేపట్టి అనంతరం తహసిల్దార్ అప్పలస్వామికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పొందూరు రాజు, జి నాగేశ్వరరావు, బి సత్యబాబు, టి సంతోష్,హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## శిథిలావస్థకు చేరిన వంశధార గెస్ట్‌హౌస్

**- నిర్వహణ లేక వెలవెలబోతున్న భవనం**

**- పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికుల విజ్ఞప్తి**

**నరసన్నపేట, జులై 6(వార్త):** నరసన్నపేటలోని వంశధార సబ్ డివిజన్ పరిధిలో అధికారులు బస చేసేందుకు నిర్మించిన ప్రభుత్వ గెస్ట్ హౌస్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుని నిర్వహణ లేక వెలవెలబోతున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు ప్రాంతాల నుంచి అధికారిక పనుల నిమిత్తం వచ్చే అధికారులు బస చేసేందుకు నిర్మించిన ఈ గెస్ట్ హౌస్ ఒకప్పుడు పూర్తిస్థాయిలో వినియోగంలో ఉండేదని స్థానికులు తెలిపారు. గతంలో మంత్రిగా పనిచేసిన ధర్మాన ప్రసాదరావు ఈ గెస్ట్ హౌస్‌ను వినియోగించుకునే సమయంలో భవనానికి అవసరమైన సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేసినట్లు గుర్తు చేస్తున్నారు. అయితే అనంతరం భవనం వినియోగం తగ్గిపోవడంతో నిర్వహణ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని పేర్కొంటున్నారు. ప్రస్తుతం భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు పరిసర ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు పెరిగి అధ్వాన్న పరిస్థితులు నెలకొన్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత సంబంధిత శాఖలపై ఉన్నప్పటికీ, గెస్ట్ హౌస్ నిర్వహణపై తగిన చర్యలు తీసుకోకపోవడం వల్ల విలువైన ప్రభుత్వ భవనం నిరుపయోగంగా మారిందని విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గెస్ట్ హౌస్‌కు మరమ్మతులు చేపట్టి అవసరమైన సౌకర్యాలు కల్పించి మళ్లీ అధికారుల వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. దీంతో ప్రభుత్వ ఆస్తి పరిరక్షణతో పాటు అధికారిక అవసరాలకు కూడా ఉపయోగపడుతుందని అభిప్రాయపడుతున్నారు.



# అమరావతి రాజధాని నిర్మాణం ఫెయిల్యూర్ ప్రాజెక్ట్

**-70 వేల మంది రైతులకు మోసం**

**- 3డీ గాఫిక్స్ తో మభ్యపెట్టారు**

**- సమగ్ర విచారణకు డిమాండ్**

**- ఉత్తరాంధ్ర అభివృద్ధిని గాలికి వదిలి అమరావతి అంటూ కాలయాపన**

**పలాస, జులై 6(వార్త):** గత ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా ప్రకటించి, వేల కోట్ల ప్రచారం చేసిన అమరావతి రాజధాని నిర్మాణం రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద ఫెయిల్యూర్ ప్రాజెక్ట్ గా మిగిలిపోయిందని వైఎస్ఆర్సీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. సోమవారం ఆయన పలాసలో విలేకరులతో మాట్లాడుతూ అమరావతి పేరుతో గత ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టిందని, ముఖ్యంగా రైతులను మోసం చేసి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నించిందని ఆరోపించారు. "ప్రపంచ స్థాయి రాజధాని కడతామని, సింగపూర్ ను మించిన నగరాన్ని నిర్మిస్తామని గొప్పలు చెప్పుకున్నారని, ప్రపంచ దేశాల నుంచి పెట్టుబడులు వస్తాయని, లక్షల ఉద్యోగాలు వస్తాయని ప్రజలకు కలలు చూపించారని అన్నారు. కానీ 7 సంవత్సరాలు గడిచినా గ్రౌండ్ లో ఒక్క ఇటుక కూడా పడలేదు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. "44,899 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టులో ఇప్పటివరకు 18 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, 2017లో ప్రారంభించిన పనులు ఇప్పటికీ అసంపూర్తిగానే ఉన్నాయని, సచివాలయం, హైకోర్టు, అసెంబ్లీ భవనాలు అని చెప్పినవి కూడా కేవలం పునాదులకే పరిమితం అయ్యావని మండిపడ్డారు. అసలు పనులు జరిగాయో లేదో కూడా తెలియని పరిస్థితి. అమరావతి అంటే టీవీల్లో, పత్రికల్లో వచ్చే 3డి మోడల్స్, గ్రాఫిక్స్, ఫోటోలు మాత్రమేనని, విజయవాడ-గుంటూరు మధ్య మెట్రో, సీడ్ యాక్సెస్ రోడ్లు, హైటెక్ భవనాలు, టవర్లు అని చూపించిన గ్రాఫిక్స్ కూడా ఇప్పుడు కనిపించడం లేదని, ఫైళ్లకే పరిమితమైన ప్రాజెక్ట్ ఇది" అని ఎద్దేవా చేశారు. 70 వేల మంది రైతుల నుంచి 34 వేల ఎకరాలకు పైగా భూములు సేకరించి వారికి బంగారు భవిష్యత్తు చూపించి మోసం చేశారని మండిపడ్డారు. "మీ భూములకు కోట్ల విలువ వస్తుందని, మీ పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని, ఇళ్లు కట్టిస్తామని ఆశ చూపించారని, ల్యాండ్ పూలింగ్ పేరుతో రైతులను నమ్మించారని ధ్వజమెత్తారు. నేడు ఆ రైతులు రోడ్డున పడ్డారని, ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని తెలిపారు. ప్రపంచ స్థాయి రాజధాని అన్నారు. కానీ ప్రపంచంలోనే పెద్ద ఫెయిల్యూర్ ప్రాజెక్ట్ గా మిగిలిపోయిందని, ఇదంతా రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం, సెటిల్మెంట్ల కోసం ఆడిన నాటకం తప్ప రాష్ట్రానికి ఒరిగింది ఏమీ లేదని ఆయన మండిపడ్డారు. రాజధాని పేరు చెప్పి కొందరు భూ దందాలు చేసి కోట్లు సంపాదించారు" అని ఆరోపించారు. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రాన్ని అమరావతి పేరుతో మరింత అప్పుల పాలు చేశారని విమర్శించారు. "ఒకవైపు ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు ఇవ్వలేని పరిస్థితి. పేదలకు సంక్షేమ పథకాలు ఇవ్వలేని దుస్థితిని, మరోవైపు అమరావతి అంటూ వేల కోట్ల ప్రచారం. ఇది స్పష్టంగా ప్రజాధనం దుర్వినియోగమే. అమరావతి పేరుతో తీసుకున్న అప్పుల భారం ఇప్పుడు రాష్ట్ర ప్రజలపై పడుతుంది. భవిష్యత్ తరాలను కూడా అప్పుల్లో ముంచారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. "శ్రీకాకుళం జిల్లా అభివృద్ధికి రావాల్సిన నిధులు కూడా అమరావతికి మళ్లించారు. పలాస లాంటి ప్రాంతాల్లో పరిశ్రమలు, ఉద్యోగాలు లేక యువత వలస వెళ్తుంటే, ఇక్కడి సమస్యలు పట్టించుకోకుండా అమరావతి అంటూ కాలయాపన చేశారు. ఒకే ప్రాంతంపై దృష్టి పెట్టి మిగతా 12 జిల్లాలను గాలికి వదిలేశారు" అని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అమరావతి నిర్మాణంలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. "ప్రజాధనం ఎలా ఖర్చు చేశారు? ఎవరెవరు లబ్ధి పొందారు? కాంట్రాక్టులు ఎవరికి ఇచ్చారు? అనే అంశాలపై సీబీఐ విచారణ జరపాలి" అని కోరారు. రాష్ట్ర అభివృద్ధికి వికేంద్రీకరణ విధానమే సరైనదని, అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తేనే రాష్ట్రం ముందుకు వెళ్తుందని సూచించారు.






## ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం



**కంచిలి, జులై 6(వార్త):** కంచిలిలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాన్ని సోమవారం నిర్వహించారు. మండల ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో కూరగాయలు, ఆకుకూరలు, చిరుధాన్యాలు, బియ్యం, బెల్లం మొదలైన ఉత్పత్తులను విక్రయించారు. వినియోగదారులు బాగా స్పందించి ఉత్పత్తుల కొనుగోలు పట్ల ఆసక్తి చూపారు. ప్రతి సోమవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించనున్నట్లు మండల మాస్టర్ ట్రైనర్ శివానందం తెలిపారు. కామరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## విశాఖ ఆస్పత్రికి వెళ్లి ఇప్పిలి పరామర్శ



**కంచిలి, జులై 6(వార్త):** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమాని ఈ మండలం బెల్లుపడా గ్రామానికి చెందిన అయుధం భాస్కరరావు ఇటీవల అనారోగ్యానికి గురై విశాఖపట్నంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో మాజీ జడ్పీటిసి సభ్యుడు ఇప్పిలి కృష్ణారావు విశాఖ ఆస్పత్రికి వెళ్లి భాస్కరరావును అతని కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకొని ధైర్యంగా ఉండాలని కోరారు. ఆరోగ్య పరిస్థితులను గూర్చి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారని ఆయన తెలిపారు.

## వైఎస్సార్ జయంతి సందర్భంగా
## మెగా వైద్య, రక్తదాన శిబిరం



**కొత్తూరు, జులై 6(వార్త):** మహానేత డా. వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని పురస్కరించుకొని ఈ నెల 8న బుధవారం పాతపట్నంలో మెగా వైద్య శిబిరంతో పాటు రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రకటించారు. మాజీ శాసనసభ్యురాలు రెడ్డి శాంతమ్మ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా కొత్తూరు మండల పార్టీ అధ్యక్షులు గండివలస ఆనందరావు, ఎంపీపీ ప్రతినిధి సవర రమేష్ మాట్లాడుతూ, పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందించాలన్న దివంగత నేత వైఎస్సార్ ఆశయ సాధనలో భాగంగానే ఈ మెగా హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కొత్తూరు మండలం సహా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ ఆరోగ్య సమస్యలకు ఉచితంగా పరీక్షలు చేయించుకోవాలని, అవసరమైన వారికి మందులను కూడా అందజేస్తామని వారు పేర్కొన్నారు. వైఎస్సార్ ఆశయాల స్ఫూర్తితో యువత, పార్టీ కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వనము లక్ష్మీనారాయణ, జిల్లా ఎస్సీ సెల్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు గుడబండి పోలయ్య, మండల ప్రధాన కార్యదర్శులు సిరిపురం హరీష్, బొమ్మాలి నగేష్, యువ నాయకులు హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రికల్ లైన్‌మన్ కూర్మారావు మృతి

**కవిటి, జులై 6(వార్త):** కవిటి మండలం గొండ్యాల పుట్టుగ గ్రామానికి చెందిన ఎలక్ట్రికల్ లైన్ మాన్ దుద్ది కుర్మారావు (45) ఆదివారం రాత్రి శ్రీకాకుళం లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. కూర్మారావు ఇచ్ఛాపురం మండలంలో విద్యుత్ శాఖలో లైన్మెన్ గా పనిచేస్తున్నారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యతో ఆయన బాధపడుతున్నారు. సమస్య తీవ్రం కావడంతో చికిత్స కోసం శ్రీకాకుళం ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ సమాచారం తెలియడంతో ఉద్దానం చుట్టుపక్కల గ్రామాల్లో విషాదం నెలకొంది. అందరితో స్నేహంగా ఉంటూ సేవా భావం కలిగిన కూర్మారావు మృతి పట్ల అనేకమంది విచారం వ్యక్తం చేశారు. సోమవారం స్వగ్రామంలో జరిగిన అంత్యక్రియలకు ఇచ్ఛాపురం,కవిటి విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది కూర్మారావు బంధువులు,స్నేహితులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆయనకు భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.



## అందరికీ ఆదర్శనీయంగా దాలెం రాజువలస



**- ఆ గ్రామంలో మందు అమ్మినా, తాగినా.. జరిమానా**

**జి.సిగడాం, జులై 6(వార్త):** జి.సిగడాం మండలంలో దాలెంరాజు వలస గ్రామం అందరికీ అదర్శంగా నిలిచింది. ఇటీవల మద్యం సేవించి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మరణించడంతో కల్తీ మధ్యం అమ్మడం వలన లేదా మద్యం సేవించడంతో ప్రజలు అనారోగ్యం చెందుతున్నారని గ్రామ యువత, అధిక సంఖ్యలో మహిళలు ఆదివారం రాత్రి గ్రామ వీధివీధుల్లో కొవ్వొత్తుల దీపాలు పట్టుకొని ర్యాలీ చేపట్టారు. సోమవారం గ్రామ పెద్దలు నిర్వహించిన గ్రామ సభలో ఊరు బాగు కోసం గ్రామస్తులంతా కలిసి సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని విధిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.ఈ నిర్ణయానికి గ్రామ ప్రజలంతా పూర్తి మద్దతు ప్రకటించారు.

## గో గ్రీన్ ఆధ్వర్యంలో మొక్కల సంరక్షణ



**మందస, జులై 6(వార్త):** మందసలో పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా 'గో గ్రీన్' సంస్థ ఆధ్వర్యంలో మొక్కల సంరక్షణ కార్యక్రమాన్ని సోమవారం జరిగింది. కార్యక్రమంలో భాగంగా పలువురు సభ్యులు మొక్కలు నాటడమే కాకుండా, వాటి రక్షణ కోసం ఐరన్ ట్రీ గార్డులను అమర్చి తమ పర్యావరణ పరిరక్షణపై తమ ప్రేమని చాటుకున్నారు.

కార్యక్రమంలో జల్లు కాళీ చరణ్ రెండు మొక్కలు నాటడంతో పాటు తన స్వంత దాతృత్వంతో వాటికి ఐరన్ ట్రీ గార్డులను కూడా అమర్చారు. అలాగే సింహాచల మహంతి ఒక మొక్కను నాటగా, దానికి నిరంజన బెహరా బహూకరించిన లోహపు గార్డును అమర్చారు. సేనాపతి రవికుమార్ మరో మొక్కను నాటగా, ఆ మొక్క రక్షణ కోసం దుర్గాప్రసాద్ పాణిగ్రహి బహూకరించిన లోహపు గార్డును ఏర్పాటు చేశారు. ప్రముఖ సంఘ సేవకుడు గిన్ని తిరుపతిరెడ్డి నాటిన మొక్కకు సాయి మోహన్ రిసోర్సెస్ ఫౌండేషన్ బహూకరించిన గార్డును అమర్చగా, ఇప్పిలి వెంకటేశ్వరరావు నాటిన మొక్కకు సేనాపతి కిషోర్ కుమార్ బహూకరించిన గార్డును రక్షణగా ఏర్పాటు చేశారు. మొక్కలు నాటడమే కాకుండా వాటికి శాశ్వత రక్షణ కల్పించేలా లోహపు గార్డులను సైతం సమకూర్చిన ఈ కార్యక్రమంలో మామిడి కోదండరావు, శ్రీనివాస పాడి, మట్ట బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

## పెంపుడు జంతువులకు టీకాలు తప్పనిసరి

**మందస, జులై 6(వార్త):** పెంపుడు జంతువులకు టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని మందస, హరిపురం పశు వైద్యాధికారులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ కిల్లి ఉమభారతి అన్నారు. మందస, హరిపురం పశు వైద్య కేంద్రాల్లో శ్రీకాంత్, ఉమాభారతి ఆధ్వర్యంలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా సోమవారం పెంపుడు జంతువులకు(కుక్కలకు) ఏంటిరేబిస్ టీకాలను వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జంతువులనుండి మనుషులకు సంక్రమించే వ్యాధులను జూనోటిక్ వ్యాధులు అంటారని, ఈ వ్యాధుల నివారణకు ప్రజలు వీటిపట్ల అవగాహన పెంచుకొని ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని, వీటి నివారణ పట్ల చైతన్యవంతులను చేసేందుకు ప్రపంచవ్యాప్తంగా జులై 6వ తేదీన ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. దాదాపు 190 రకాల వ్యాధులు జంతువులనుంచి మనుషులకు సోకుతాయని, ఇళ్లల్లో పెంపుడు జంతువులను పెంచుకొనేవారు జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే వ్యాధులు గురించి తెలుసుకొని, వాటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను పాటించాలన్నారు. అనంతరం హాస్పిటల్ కు తీసుకువచ్చిన పెంపుడు జంతువులకు ఏంటిరాబిస్ టీకాలను వేశారు. ద

కార్యక్రమంలో సిబ్బంది ఎన్.ధర్మేంద్ర, సీహెచ్.ప్రసన్న, రవి, కళ్యాణ్ కుమార్, ఇంతియాజ్, పార్వతి, మురళి, ఉమా, మాసయ్య, నిత్యనందం, శ్రావణి, సురేష్, కూర్మారావు, తిరుపతి, పెంపుడు కుక్కల యజమానులు పాల్గొన్నారు.



## ముమ్మరంగా పారిశుధ్య పనులు



**జి.సిగడాం, జులై 6(వార్త):** గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ముఖ్యంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని దానికి ప్రతి ఒక్కరూ బాద్యతగా సహకరించాలని ఎంపీడీఓ జి.రామకృష్ణారావు అన్నారు.సోమవారం మర్రివలస, మానంపేట గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి పైల జాన్సీ ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుధ్య పనులను చేపట్టారు.డ్రైనేజీలు నిండిపోవడంతో పారిశుధ్య కార్మికులతో పూడిక మట్టిని తొలగించారు. వర్షాకాలపు సీజన్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పారిశుధ్యం పై దృష్టి సారించారు. డ్రైనేజీ ట్రాక్టర్ సహాయంతో చెత్త నుండి సంపద కేంద్రానికి మరియు గ్రామ దూర ప్రాంత్రాలకు తరలించారు. అనంతరం దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ నిర్వహించారు.డ్రైనేజీ, బావుల్లో, బోర్లు వద్ద బ్లీచింగ్ చల్లారు.

## వానరానికి అంతిమ సంస్కారాలు



**ఇచ్ఛాపురం, జులై 6(వార్త):** విద్యుత్ షాక్ నకు గురై ఒక వానరంమృత్యువాత పడింది. సోమవారం పట్టణ పరిధి జీఐసీ కాలనీ జంక్షన్ వద్ద ఓషాపు వద్ద పైన ఉన్న విద్యుత్ వైర్లు తగిలి వానరం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న కాలనీ యువకులు టుక్కోగౌడ, డిల్లీ బెహరా, కిషన్ బెహారాలు ముగ్గురు వానారాన్ని రిక్షాలో అంతిమ యాత్ర చేపట్టి బాహుదానదిలో గోతులో పూడ్చారు. వానరం మృతదేహం పై గందపు చక్కలు, నెయ్యిని వేసి పూడ్డారు. జై శ్రీరాం అంటూ నినాదాలు చేశారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ఇచ్ఛాపురం, జులై 6(వార్త):** ఇచ్ఛాపురం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పట్టణ, మండల పరిధిలో కొన్ని , గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ జి.యఘ్నేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8గంటల నుండి సాయింత్రం 4గంటల వరకు టౌన్ పరిదిలో రైల్వేస్టేషన్, గొల్లవీది, పకీర్ పేట, వీకేపేట, రత్తకన్న, మండల పరిదిలో మండపల్లి, బుడుపుపేట, తోటూరు, మశాఖపురం, జగన్నాధపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

## విభిన్నప్రతిభావంతులకు గుర్తింపునకు శిబిరాలు



**మందస, జులై 6(వార్త):** శారీరక విభిన్నప్రతిభావంతులకు బ్యాటరీ అఫరైటర్డ్ ట్రైసైకిల్స్, బ్యాటరీ అఫరైటర్డ్ వీల్ చైర్స్ సరఫరాలో భాగంగా ఈ నెల 7, 8తేదీల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్టు మదర్ వలంటీర్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లారెడ్డి భాస్కరరావు చెప్పారు. శారీరక విభిన్నప్రతిభావంతులను గుర్తింపులో భాగంగా ఈనెల 7న శ్రీకాకుళంలోని జిల్లా ప్రజా పరిషత్ వద్ద ఎచ్చెర, శ్రీకాకుళం, ఆముదాలవలస, నరసన్నపేట నియోజకవర్గాలకు, 8న ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం, టెక్కలి నియోజకవర్గాలకు సంబంధించి గుర్తింపు శిబిరాలు నిర్వహించబడతాయని చెప్పారు. అర్హత కలిగిన శారీరక విభిన్నప్రతిభావంతులు తమ ఆధార్ కార్డ్, సదరం సర్టిఫికేట్, యూడీఐడీ కార్డ్, రేషన్ కార్డ్, ఫుల్ పోటో పాస్ పోర్ట్ సైజ్ లో రెండు పోటోలు తదితర సర్టిఫికెట్స్ తో హజరుకావాలని, సహాయసంచాలకులు (విభిన్నప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్దుల సంక్షేమశాఖ, శ్రీకాకుళం జిల్లా) నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయన్నారు.

## అమ్మో రాజపురం బీసీ హాస్టల్

*** దారుణంగా మౌలిక సదుపాయాలు * హాస్టల్ విద్యార్థులతో చెలగాటం * తాగడానికి మంచినీరు కూడా లేని దుస్థితి * పనిచేయని ఫ్యాన్లు * టాయిలెట్లు పరిస్థితి మరీ దారుణం * నాణ్యత లేని భోజనం * ప్రభుత్వ తీరుపై మండిపడ్డ వైసిపి నేత శ్యాంప్రసాద్**



**కవిటి, జూలై 6 (వార్త):** కవిటి మండలం రాజపురం లో గల బీసీ బాలుర వసతిగృహం పరిస్థితి అత్యంత అద్వాన్నంగా మారింది. నాణ్యమైన చదువులు పేరుతో ఆరోగ్యకరమైన ఆహారం అందిస్తున్నామంటూ చెప్పుకుంటున్న అధికారులు అటువంటి సదుపాయాలు ఏమీ కల్పించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతున్నారని ఇచ్ఛాపురం నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు తల్లి దండ్రుల ఫిర్యాదుల మేరకు సోమవారం సాయంత్రం ఆయన హాస్టల్ ను పరిశీలించారు. హాస్టల్లో నెలకొన్న దయనీయమైన పరిస్థితులను ఆయన గుర్తించారు. విద్యార్థులు తాగడానికి మంచినీరు కూడా హాస్టల్లో లేదని వాపోయారు. చాలావరకు సీలింగ్ ఫ్యాన్లు పనిచేయకపోవడంతో విద్యార్థులు దోమలతో కాలక్షేపం చేయక తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నైట్ వాచ్మెన్ లేకపోవడం విద్యార్థులకు ఇబ్బంది కరంగా ఉందని అన్నారు. చదువుకునేందుకు సరిపడా లైటింగ్ హాస్టల్లో లేదని వాపోయారు. టాయిలెట్ల పరిస్థితి కూడా దారుణంగా ఉందని గత్యంతరం లేక విద్యార్థులు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని పేర్కొన్నారు. స్టడీ అవర్ ట్యూటర్ లేరని, భోజనంలో నాణ్యత లేదని, హాస్టల్కు గేటు లేదని, గదుల తలుపులకు గొళ్లేలు లేవని,దోమల నివారణకు విండో మ్యాచులు లేవని సమస్యలను ఏకరువు పెట్టారు. భవనంలోని స్లాబులు పెచ్చులూడి ప్రమాదకరంగా మారాయని, హాస్టల్ అపరిశుభ్రమైన వాతావరణంలో ఉందని శ్యాం ప్రసాద్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నో గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ఇటువంటి వసతి గృహాలను పరిశీలించాలని ఆయన పేర్కొన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేస్తానని శ్యాంప్రసాద్ తెలిపారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodoo colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodoo colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com cell. 9963063761, 9160000247, RNI/APTEL/2023/87546